సాక్షి
అనంతపురం
శుక్రవారం । 10 । మార్చి । 2023



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. 491 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట ఇంకా అక్కడక్కడా చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు

- షెడ్యూలు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 35,305 మంది విద్యార్థులు



రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల షెడ్యూలు విడుదలైంది. ఏప్రిల్ 3న ప్రారంభమై 18 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూలును గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. అనంతపురం జిల్లాలో 35,305 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 29,930 మంది రెగ్యులర్ విద్యార్థులు, 5,375 మంది ప్రైవేట్ (వన్‌ఫెయిల్డ్) విద్యార్థులు ఉన్నారు. మొత్తం 139 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల రవాణాకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు సమయం కేటాయించారు. ప్రతి పరీక్షకు ఒకట్రెండు రోజులు విరామం ఉంది.

పరీక్షల షెడ్యూలు ఇలా...

ఏప్రిల్ 3న తెలుగు, 6న హిందీ, 8న ఇంగ్లిష్, 10న గణితం, 13న సైన్స్, 15 సోషల్, 17న కాంపోజిట్ కోర్స్, 18న ఒకేషనల్ కోర్సు పరీక్షలుంటాయి.

ఒక్క మాతృ మరణం కూడా సంభవించరాదు

- డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి



ఆస్పత్రిలో హైరిస్క్ మహిళలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

శెట్టూరు: జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా సంభవించకుండా వైద్య సిబ్బంది జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. బాల్య వివాహాలపై ఆరా తీశారు. హైరిస్క్ మహిళల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపం కారణంగా రక్తహీనత సంభవిస్తుందన్నారు. గర్భస్థ దశలో పోషకాహారం తీసుకోకపోవడంతో తల్లులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత, డాక్టర్ తరుణ్‌సాయి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారా పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర జట్టు ఎంపిక



రాష్ట్ర పారా పవర్ లిఫ్టింగ్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో గురువారం పారా పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ మాట్లాడుతూ అనంత వేదికగా రాష్ట్ర స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా పారా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కోర్సు రెగ్యులర్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 10 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురం , కొత్తచెరువు, కళ్యాణదుర్గంలో ముగ్గురేసి చొప్పున , తాడిపత్రిలో ఒక విద్యార్థి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడటంతో డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

కన్నేస్తారు.. కొట్టేస్తారు..

హవాలా డబ్బు ఎంత రహస్యంగా చేతులు మారినా.. అతడికి తెలిసిపోతుంది. డబ్బు ఎవరు తీసుకెళతారు.. ఏ దారిలో, ఏ వాహనంలో వెళుతుందో.. నంబరుతో సహా చెబుతాడు. ఇదంతా ఫోన్‌లో తన అనుచరుడు అప్పాకి మాత్రమే చేరవేస్తాడు. డాన్ చెప్పినట్లుగా తన సైన్యంతో రంగంలోకి దిగే అప్పా గ్యాంగ్ చెప్పినట్లుగా పని పూర్తి చేస్తుంది. అక్కడి నుంచి ఆ డబ్బు వాటాల రూపంలో చేతులు మారిపోతుంది. దోపిడీ చేసిన అప్పాకి సగభాగం వాటా అయితే.. దోచుకోమని చెప్పిన బాస్‌కు సగం. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే.. హవాలా డబ్బు దోచుకోమనే వ్యక్తిని అప్పా కూడా చూడకపోవడం. సినిమాలను మరిపిస్తూ కేవలం చైన్ లింక్‌తో సాగిపోయే ఈ దారి దోపిడీ ముఠా గుట్టును అనంత పోలీసులు రట్టు వేశారు.

- 'రాప్తాడు' దారి దోపిడీ కేసులో కళ్లుచెదిరే ట్విస్టులు
- కేరళకు చెందిన శ్రీధరన్ ముఠాగా గుర్తింపు
- ఇప్పటివరకూ రూ. 60 కోట్లకు పైగానే కొల్లగొట్టినట్లు సమాచారం
- రాబర్ట్ అలియాస్ అప్పా గ్యాంగ్ ద్వారా దారి దోపిడీలు
- 60 చోట్ల దొంగతనాలకు పాల్పడినా మూడే ఫిర్యాదులు!
- నలుగురి అరెస్ట్‌తో కేసు ముగించిన అనంత పోలీసులు
- నేడు మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం



దారి దోపిడీ ముఠా డాన్ కొడాలి శ్రీధరన్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 15 రోజుల క్రితం రాప్తాడు సమీపంలో జరిగిన ఓ దోపిడీ కేసును ఛేదించేందుకు రంగంలోకి దిగిన అనంత పోలీసులకు ట్విస్టుల మీద ట్విస్టులు వెల్లడైనట్లు సమాచారం. రూ. 1.89 కోట్ల నగదు చోరీ కేసులో నలుగురు పట్టుబడినా.. వారంతా జీతగాళ్లేనని, అసలు ముఠా డాన్ గురించే వారికి అసలు తెలియనే లేదని గుర్తించారు. ఇటీవలి కాలంలో అతిపెద్ద 'హవాలా' దోపిడీగా పేరుగాంచిన ఈ కేసును విచారిస్తున్న పోలీసులకు తెలిసిన వివరాలు క్షణక్షణం ఉత్కంఠ రేపే సినిమా తరహాలో ఉన్నాయి.

కేరళ కేంద్రంగా ముఠా..

కేరళా రాష్ట్రానికి చెందిన శ్రీధరన్ ఎవరో... ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. కానీ అతని వెనుక అతి పెద్ద నెట్‌వర్క్ ఉంది. కోటి రూపాయలు పైగా హవాలా డబ్బు ఉంటేనే సుందర్‌రాజన్ దోపిడీకి ప్లాన్ చేస్తాడు. లేదంటే పట్టించుకోడు. శ్రీధరన్ ఇప్పటి దాకా నేరుగా రంగంలోకి దిగి హవాలా డబ్బు తీసుకెళ్లేవారిపై ఎటాక్ చేయలేదు.కేవలం అప్పా ద్వారా కథ నడిపిస్తాడు. మనుషుల ప్రాణాలకు హాని కలిగించకుండా కేవలం మారణాయుధాలతో బెదిరించి దోచుకోవడంతో ఈ ముఠా కదలికలపై పోలీసులు పెద్దగా దృష్టి సారించలేదు. పైగా డబ్బు పోగొట్టుకున్న ప్రతి ఒక్కరూ నల్లధనం కలిగిన వారు కావడంతో మూడో కంటికి తెలియకుండా ఫిర్యాదుల జోలికి వెళ్లకుండా ఉండిపోయారు. దీన్నే అదనుగా తీసుకున్న శ్రీధరన్ గ్యాంగ్ 60కి పైగా దారి దోపిడీలు చేసి డబ్బుతో ఉడాయించింది. అందులో ముగ్గురు మాత్రమే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఏడు రాష్ట్రాల్లో నిఘా..

శ్రీధరన్ గ్యాంగ్ చాలా చాకచక్యం...నేర్పరి తనంతో హవాలా డబ్బు దోచుకుంటుంది. ముఠాలో 40 మంది దాకా దొంగలున్నప్పటికి ఎవరూ శాశ్వతంగా ఉండరు. ఎవరికీ సిమ్ కలిగిన సెల్‌ఫోన్‌లు ఇవ్వరు. కేవలం ఇంటర్‌నెట్ ఆధారంగా కాల్స్ చేసే వెసులుబాటు ఇస్తారు. ఈ తరహా బ్యాచ్‌లను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేసుకోవడం అప్పానకు పెట్టింది పేరు.. ఇప్పటి దాకా శ్రీధరన్ గ్యాంగ్ ఈతరహా దోపిడీలు ఏడు రాష్ట్రాల్లో చేసింది. వీరి కోసం ఏడు రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. కారణం ఫిర్యాదు లేకపోయినా ఈ గ్యాంగ్ కార్యకలాపాలు ఆ రాష్ట్రాల పోలీసులకు తెలుసు. కానీ శ్రీధరన్‌ను పట్టుకోవడం అంత సులభం కాదు. చాలా మంది పోలీసు అధికారులు శ్రమించి ఫలితం లేక ఆగిపోయారు.

ముందుగానే రెక్కీ..

శ్రీధరన్ గ్యాంగ్ హవాలా డబ్బుకోసం దోపిడీకి ప్లాన్ చేస్తే ఎలా ఉంటుందో కనుక్కోవడం చాలా కష్టం. ఈ విషయం రంగంలోకి దిగిన అనంత పోలీసులకు బాగా అర్థమైంది. దోపిడీకి స్కెచ్ వేయడానికి ముందే ఓఎల్‌ఎక్స్‌లో వాహనాలకు సంబంధించిన నంబర్లను ఈ గ్యాంగ్ ఆన్‌లైన్‌లో తెలుసుకుంటుంది. వాహనాల రంగుతో పాటు నంబర్ల ప్లేట్‌లను ఒక్కో వాహనానికి 5 నంబర్లు ఎంపిక చేస్తుంది. రంగంలోకి దిగడానికి ముందుగానే ఆ రూట్‌ను నాలుగు గ్యాంగ్‌లు పరిశీలిస్తాయి. సాధారణంగా వాహనాలు ఎక్కడ ఆపుతారు? ఆపితే దోపిడీ చేసి ఎలా తప్పించుకోవాలో కూడా పక్కా ప్లాన్ చేస్తారు. వంద కిలోమీటర్ల దూరంలో ఒక బ్యాచ్ పాగా వేస్తుంది. అక్కడే బస చేసి పరిస్థితులను పసిగట్టి రంగంలోకి దిగుతుంది.తాజాగా రాప్తాడు సమీపంలో హంపాపురం వద్ద దోపిడీకి ముందు ముఠా పెనుకొండలో ఓ లాడ్జిలో రెండురోజులు గడిపింది.

రంగంలోకి దిగాక..

ఈ గ్యాంగ్ దోపిడీకి ప్లాన్ చేసి బ్యాచ్‌లుగా విడిపోయాక తిరిగి కలిసేది దోచుకునే క్షణాల వ్యవధిలో మాత్రమే. ప్రతి బ్యాచ్‌లో ఐదుగురు సభ్యులు. వారి వాహనం టోల్‌గేట్ దాటితే చాలు కార్ల నంబర్లు మార్చేస్తారు. మనుషులు టోల్‌గేట్ల వద్ద కనిపించకుండా జాగ్రత్త పడతారు. పైగా నంబరు ప్లేట్‌లను మార్చడంతో పోలీసులకు సైతం ఈ ముఠాపై అనుమానం వచ్చే అవకాశం లేదు. అలా ఒక్కో వాహనంలో 5 నంబరు ప్లేట్‌లు ఉంచుకుని సాగిపోతుంటారు. దోపిడీ చేసే దాకా ఏ సెల్‌ఫోన్‌లో ఉన్నారో తెలియదుగానీ,. దోపిడీ చేసిన అనంతరం ఈ గ్యాంగ్‌స్టర్ వీరికి పంపిన సిమ్‌కార్డులతో, వాటి నుంచి మరో ముగ్గురికి ఇంటర్‌నెట్ కాల్స్‌లో మాత్రమే అందుబాటులో ఉండాలి. దోపిడీ జరిగిన గంటల వ్యవధిలో ఎవరి వాటా వారు తీసుకుని వెళ్లిపోతారు. 75 శాతం వాటా తీసుకుని అప్పా కూడా వెళతాడు. అయితే, శ్రీధరన్‌కు అప్పా ఎలా డబ్బు పంపుతాడో ఎవరికీ తెలియదు. ఇప్పటికీ ఈ కేసులో శ్రీధరన్‌తో పాటు అప్పా జాడకూడా కనిపించకపోవడంతో పోలీసుల అన్వేషణ అర్థంతరంగా ఆగిపోయింది.

కొనసాగుతున్న వేట ..

ఏడు రాష్ట్రాల డీజీపీలు ఎదురుచూస్తున్న శ్రీధరన్, అప్పా గ్యాంగ్ కోసం అనంత పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురు సభ్యులను పట్టుకున్న పోలీసులు సుమారు రూ. 2 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. నేడు ముఠాకు సంబంధించిన సభ్యులను మీడియా ముందుంచి రిమాండ్‌కు తరలించే అవకాశం ఉంది.

బ్యాడిగ మిర్చి అ'ధర'హో

గుమ్మఘట్ట: బహిరంగ మార్కెట్‌లో బ్యాడిగ మిర్చి ధరలు మెరిశాయి. గత వారం క్వింటాలు రూ. 48 వేలు పలికిన ఈ రకం మిర్చి గురువారం ఏకంగా రూ.58,000 వరకూ చేరాయి. కర్ణాటకలోని బ్యాడిగ పట్టణ మార్కెట్‌కు గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన తిప్పేశ్, రంగసముద్రం గ్రామానికి చెందిన బోయ గిరీష్‌లు పంట దిగుబడిని తీసుకెళ్లగా.. మొదటి రకం క్వింటాలు రూ.57,289, రెండో రకం రూ.49,920, మూడో రకం రూ.38,600కు అమ్ముడుపోయాయి. తిప్పేశ్ 10 క్వింటాళ్లు, గిరీష్ 6 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌లో విక్రయించారు. వారంలోనే ధరలు పెరిగి అధిక లాభాలు రావడంతో రైతుల సంతోషం అంతా ఇంతా కాదు. వడ్రవన్నూరు గ్రామానికి చెందిన రైతు తిప్పేస్వామి ఇచ్చిన సలహాలు, సూచనలతో మంచి దిగుబడి సాధించినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవమయ్యేలా చూడండి

- ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధికారి డాక్టర్ చెన్నకేశవులు



విడపనకల్లులో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ చెన్నకేశవులు

కూడేరు/విడపనకల్లు: ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవయ్యేలా చూడాలని జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్‌ఎం) జిల్లా అధికారి చెన్నకేశవులు ఆదేశించారు. గురువారం కూడేరు, విడపనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం కింద నిర్వహించిన వైద్య శిబిరాలను పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశువు సురక్షితంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో డాక్టర్లు ఖాదర్, సరిత, సీహెచ్‌ఓ మోహన్ బాబు, సూపర్ వైజర్లు రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ, శర్మస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మేమేం చేశామో ప్రజలకు తెలుసు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, చిత్రంలో బైరెడ్డి సిద్దార్థరెడ్డి



బహిరంగ సభకు భారీగా హాజరైన జనం

- జేసీ సోదరుల అవినీతిని చెప్పాలంటే ఈ జన్మ సరిపోదు
- టీడీపీ నేతలే వారి ఓటమి కోరుకుంటున్నారు
- తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం
- ఆధారాలతో జేసీల అక్రమాలపై వివరణ
- సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలని పిలుపు

తాడిపత్రి: ''ఎమ్మెల్యే అయ్యాక పప్పూరమ్మ ఆలయ అభివృద్ధి కోసం రూ. కోటి ముఖ్యమంత్రి సహకారంతో మంజూరు చేయించా. జేసీ సోదరుల 30 సంవత్సరాల హయాంలో అశ్వత్థం ఆలయానికి సంబంధించి కానుకలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు కలిపి రూ. 4.75 కోట్ల డబ్బు ఉంచితే, ఈ మూడేళ్లలోనే రూ. 3.50 కోట్ల చేకూర్చగలిగా. గతంలో ఎన్నడూ లేని విధంగా తాడిపత్రిలో నేడు శాంతిభద్రతలు నెలకొన్నాయి. సంక్షేమ కార్యక్రమాలతో సామాన్యులకు రూ. కోట్ల లబ్ధి చేకూర్చాం. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేమేం చేశామో ప్రజలకు తెలుసు.'' అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. పెద్దపప్పూరు మండలంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రేరేపించి రాజకీయంగా ఎదిగిన గద్వాల్ దొంగలు జేసీ సోదరులు అని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో వారు చేసిన అభివృద్ధి గురించి చెప్పుకునే దమ్ము లేని పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమ యాత్రకు వస్తున్న స్పందన చూసి ఓర్వలేక కుటిల రాజకీయాలకు తెరలేపారన్నారు. అసత్య కథనాలను సాక్ష్యాధారాలతో సహా వివరించారు. ముచ్చుకోట రిజర్వాయర్‌లో నీరు ఉన్నా లేదని చెప్పడం వారి గజినీ మెదళ్లకు నిదర్శమని విమర్శించారు. పప్పూరు మాన్యాన్ని కౌలుకు తీసుకున్న ప్రభాకర్ రెడ్డి డబ్బు చెల్లించలేదని.. చివరకు మీడియాలో కథనాలు వచ్చాక చెల్లించిన ఘనుడని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో తాడిపత్రిలోని పెన్నా పాత బ్రిడ్జి వద్ద, సజ్జలదిన్నె వద్ద పెద్దపెద్ద గోతులు పడేలా వారి బినామీలు యథేచ్ఛగా ఇసుకను కర్నూలు, బనగానపల్లి, నంద్యాల ప్రాంతాలకు తోలి విక్రయించుకున్నారని ఫొటోలతో సహా వివరించారు. త్రిశూల్ సిమెంట్ వ్యవహారంపై నాడు టీడీపీ నాయకులు జేసీ సోదరుల వైఖరిని ఖండించలేదా అని ప్రశ్నించారు. గత కలెక్టర్‌ను మేనేజ్ చేసి త్రిశూల్ వ్యవహారంలో కోర్టు విధించిన జరిమానా చెల్లించలేదని, ప్రస్తుత కలెక్టర్ అందుకు ససేమిరా అనడంతో మహిళా ఉన్నతాధికారి అని చూడకుండా ఆమెపై చిందులు తొక్కాడని తెలిపారు. ఏం చేయడానికైనా సిద్ధపడే వెధవలు జేసీ సోదరులని విరుచుకుపడ్డారు. వారి అవినీతి గురించి చెప్పాలంటే నా జీవితం కూడా సరిపోదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేవుడి సొమ్ము తినలేదని ఎక్కడైనా ప్రమాణం చేసేందుకు తాను సిద్ధమన్నారు. డబ్బు చెల్లించి కొన్న భూమిలో తాను వ్యవసాయం చేస్తున్నానని, జేసీ ప్రభాకర్‌రెడ్డిలాగా తాడిపత్రి సజ్జలదిన్నె వద్ద కంప చెట్లు తొలగించినందుకు 25 ఎకరాలు జేసీబీ యజమానికి రాయించడం లాంటి నీచానికి పాల్పడలేదన్నారు. ప్రబోధానంద ఆశ్రమ అల్లర్లు, పోలీస్ స్టేషన్‌కు తాళాలు వేయడం, మట్కాడాన్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన సీఐ, ఇతర పోలీసులను చితకబాదించిన జేసీ సోదరులు ఇప్పుడు ప్రజాస్వామ్యం గూర్చి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఇలాంటి వారిని నమ్మారో మళ్లీ వారికి జీవింతాంతం ఊడిగం చేయాల్సి వస్తుందని హితవు పలికారు.

ప్రజల సంక్షేమమే ముఖ్యం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట, ఇక్కడి ప్రజల కోసం గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు సుముఖత చూపానని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పాలన కావాలో నీచ రాజకీయాలు చేసే వారు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు స్వేచ్ఛగా బతకాలన్నదే తమ ఆశయమని, అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

పెద్దారెడ్డి దెబ్బకు జేసీల ప్యాంట్లు తడుస్తున్నాయ్..

తాడిపత్రిలో ఏదో జరిగిపోతోందంటూ రాద్ధాంతం చేయడం జేసీ సోదరులు మానుకోవాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి హితవు పలికారు. ప్రజాసంక్షేమ పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దెబ్బకు జేసీ సోదరులు ప్యాంట్లు తడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వారు అనాల్సింది సేవ్ తాడిపత్రి అని కాదని, పెద్దారెడ్డి సేవ్డ్ తాడిపత్రి అని చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడు ఇంటి గేట్లు తెరిస్తే అలా లోపలికి పోయి వైఎస్సార్ సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబుకు కుప్పం ప్రజల విలువ ఏంటో చూపిన మొగోడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆయన పౌరుషం గురించి పప్పు లోకేష్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నీచ నాయకులైన జేసీ సోదరులు పాంప్లెట్ రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారని యువ నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు.



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి

మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ. 2.50 కోట్లతో సీసీ రోడ్లు వేయిస్తున్నారని, సాగు, తాగు నీరు సౌకర్యం కల్పించి ప్రజలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న నాయకుడిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం

కూడేరు/విడపనకల్లు: పాడి రైతులు ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నదే తమ లక్ష్యమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన కూడేరులోని పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలకు సంబంధించి రిజిస్టర్ పరిశీలించారు. గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్‌పై స్థానిక పశువైద్యాధికారి శ్రీనివాసులుతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులు గాలికుంటు వ్యాధి బారినపడకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వాహనం ద్వారా పశువులకు అందే వైద్య సేవలు , టోల్ ఫ్రీ నంబర్ 1962పై పశువుల పెంపకందారులకు, రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. గాలికుంటు వ్యాధి వైరస్ ద్వారా వ్యాపించే అంటువ్యాధి అని దీనికి మందులు పనిచేయవని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 3.65 లక్షల ఆవులు, గేదెలకు ఈ నెల 1 నుంచి 31 వరకు వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. నెలాఖరుకు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విమర్శలకు తావివ్వొద్దు



హాజరైన అధికారులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఆర్‌ఓ నాగలక్ష్మి

- అధికారులకు ఆర్‌ఓ నాగలక్ష్మి ఆదేశం

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ దశలోనూ విమర్శలకు తావివ్వకుండా విధులను బాధ్యతగా నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎన్నికల ప్రిసైడింగ్, సెక్టోరియల్, పోలింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎన్నికల అధికారులు, సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై శిక్షణ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సామగ్రి సక్రమంగా అందాయా లేదా అని రిసెప్షన్ కౌంటర్ వద్దనే సరిచుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ముందు రోజే కేంద్రాలకు చేరుకోవాలని, బయట తిరగకూడదని కచ్చితమైన ఆదేశాలిచ్చారు. ఏజెంట్లను ఉదయం 7.30 గంటలకు పంపించాలని అభ్యర్థులకు చెప్పామని, అంతకుముందే పోలింగ్ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఏజెంట్లకు ఖాళీ బ్యాలెట్ పెట్టెలను చూపించి, డిక్లరేషన్‌లో సంతకం తీసుకుని సీల్ వేయాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఆ సమయం తరువాత వచ్చే ఓటర్లను అనుమతించరాదని తెలిపారు. అప్పటికే వచ్చి క్యూలో నిల్చున్న వారికి టోకెన్లు ఇచ్చి అనుమతించాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా, ఎలా ఓటు వేయాలని తెలిపే పోస్టర్లను కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్‌ఫోన్ తీసుకురాకూడదన్నారు. పీఓ ఇచ్చిన పెన్‌తోనే బ్యాలెట్ పేపర్‌లో ప్రాధాన్యత అంకెలు వేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు మూసివేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ జిల్లాలో మద్యం విక్రయాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి నిషేధం విధించారు. ఈ మేరకు గెజిట్‌ను గురువారం విడుదల చేశారు. మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, ఇతర మద్యం కౌంటర్లు మూసివేయాలన్నారు. 16న జేఎన్‌టీయూ కళాశాలలో లెక్కింపు ఉంటుందని, ఆ రోజు కూడా జేఎన్‌టీయూ కళాశాలకు 5 కిలోమీటర్ల పరిధిలో లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

భవన నిర్మాణ బిల్లుల విడుదల

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు రూ.3.44 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఆ శాఖ సూపరింటెండెంట్ (ఎస్ఈ) యమ్మాని భాగ్యరాజ్, డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల(గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఇతర భవనాలు)కు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. గుంతకల్లు నియోజకవర్గానికి సంబంధించి రూ.31.05 లక్షలు, కళ్యాణదుర్గం - రూ.28.43 లక్షలు, రాప్తాడు- రూ.25.44 లక్షలు, రాయదుర్గం- రూ.139.02 లక్షలు, శింగనమల- రూ.30.83 లక్షలు, తాడిపత్రి- రూ.44.17 లక్షలు, ఉరవకొండ- రూ.44.79 లక్షల మేర నిధులు విడుదలయ్యాయని వివరించారు.

ఏసీబీ వలలో వీఆర్‌ఓ

- రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు




స్వాధీనం చేసుకున్న నగదు, వీఆర్వో లక్ష్మీదేవి

రొళ్ల: పట్టాదారు పాసు పుస్తకం మంజూరు కోసం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ శ్రీ సత్యసాయి జిల్లా రొళ్ల మండలంలోని దొడ్డేరి గ్రామ వీఆర్‌ఓ లక్ష్మీదేవి ఏసీబీకి పట్టుబడ్డారు. గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. కర్నూలు ఏసీబీ డీఎస్పీ, అనంతపురం ఇన్‌చార్జ్ జే.శివనారాయణస్వామి తెలిపిన మేరకు.. రొళ్ల మండలం అప్పేపల్లికి చెందిన రైతు గోవిందరెడ్డి తన తల్లి రంగమ్మ పేరు మీద ఉన్న 4 ఎకరాల భూమిని అన్నదమ్ములైన తిమ్మారెడ్డి, వెంకటచలపతితో కలసి 2021లో మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పట్టాదారు పాసుపుస్తకం కోసం దొడ్డేరి వీఆర్వో లక్ష్మీదేవిని సంప్రదించగా రూ.12 వేలు డిమాండ్ చేసింది. ఇటీవల గోవిందరెడ్డి అడ్వాన్స్ కింద రూ.3 వేలు ఇచ్చారు. గురువారం రూ.6 వేలు ఇస్తానని, పాసుపుస్తకం ఇచ్చిన తర్వాత మిగిలిన రూ.3 వేలు చెల్లిస్తానని గోవిందరెడ్డి చెప్పడంతో వీఆర్వో లక్ష్మీదేవి ఒప్పుకున్నారు. ఈ క్రమంలోనే గోవిందరెడ్డి అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. వారి ఆదేశాల మేరకు డబ్బును తను నివాసం ఉన్న ఇంట్లో వీఆర్‌ఓ లక్ష్మీదేవికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. విచారణ అనంతరం కర్నూలు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధకశాఖ ఇన్‌స్పెక్టర్లు ప్రభాకర్, మోహన్‌ప్రసాద్, శాంతిలాల్, శంకర్‌రెడ్డి, హేమంత్‌కుమార్, ఎస్‌ఐ హరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరం నేర్చిన పల్లె



ఈ పెద్దాయన పేరు రూప్లానాయక్. నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు బజిలిబాయి, కుంటునాయక్ కూలీ పనుల కెళ్లి నాలుగు పైసలు సంపాదించుకుని వస్తే ఆ రోజు గడిచేది. ఈ క్రమంలో చదువులు ఒక్కటే తమ కష్టాలను దూరం చేస్తాయని భావించిన రూప్లానాయక్... ఇంట్లో వద్దన్నా వినకుండా పాఠశాలలో చేరారు. రోజూ 10 కిలోమీటర్ల దూరం కాలినడకన రాయదుర్గంలోని పాఠశాలకు చేరుకునేవారు. ఒక పూట తిని మరో పూట పస్తులుంటూ ఉన్నత విద్యను అభ్యసించి రాయలసీమ జిల్లాల్లోనే గిరిజన కుటుంబాల్లో డిగ్రీ పట్టా అందుకున్న తొలి వ్యక్తిగా ఖ్యాతి గడించారు. అనంతరం 1960లో నిర్వహించిన సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అర్హత సాధించి కో–ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 1988లో డిప్యూటీ రిజిస్టర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. అక్షరం విలువ తెలిసిన వ్యక్తి కావడంతో తన నలుగురి సంతానంలో ఇద్దరు కుమార్తెల్లో ఒకరిని డాక్టర్, మరొకర్ని బ్యాంక్ మేనేజర్‌గా చేశారు. కుమారుల్లో ఒకరిని వ్యవసాయాధికారిగా మార్చారు. మరొకరు ఇంటి వద్ద వ్యవసాయ పనులు చూసుకుంటున్నారు.

....ఇలా మొదలైన ఈ ప్రస్థానం.. ఊరంతా పాకింది. రూప్లానాయక్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకున్న గ్రామస్తులు.. తమ బిడ్డల్ని పట్టుదలతో చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. అక్షరమనే ఆయుధంతో పేదరికాన్ని తరిమికొట్టారు. అనాదిగా పడుతున్న కష్టాలకు తెరదించుతూ.. భావితరాలకు తరగని సంపదనిచ్చారు. తొలుత ఒక్కరితో మొదలైన ఉద్యోగ ప్రస్థానం నేడు వందకు పైగా చేరుకుంది. అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకున్న అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం ఆర్‌బీ వంక (బొందనకల్లు) తండా ప్రత్యేకతపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



ఆర్.బి.వంక తండాలోని ఓ వీధి



వందలాది మంది భవితకు పునాదులు వేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- గిరిజన గూడెంలో అందరూ విద్యావంతులే
- ఒకరితో మొదలై వంద మందికి చేరిన ప్రభుత్వ ఉద్యోగులు
- సీమ జిల్లాల్లోనే డిగ్రీ పట్టాపొందిన తొలి గిరిపుత్రుడు ఇక్కడే
- మారెమ్మ పండుగొస్తే ఊరంతా ఉద్యోగుల సందడి
- జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన 'ఆర్‌బీవంక'

రాయదుర్గం: ఆర్‌బీవంక (బొందనకల్లు)తండా రాయదుర్గం మండలంలోని ఓ మారుమూల గ్రామం. దాదాపు 640 కుటుంబాలు, 2,454 మంది జనాభా ఉన్నారు. ఇందులో ఎస్టీలు 1,183 మంది, ఎస్సీలు 398 మంది, మిగిలిన 873 మందిలో కురుబ, వాల్మీకి, రెడ్డి, ఇతర సామాజిక వర్గాల వారు ఉన్నారు. వీరంతా ఒకప్పుడు నిరుపేదలే. వ్యవసాయం, కూలీ పనులే జీవనాధారం. అప్పట్లో ఈ గ్రామస్తులకు అక్షరం ముక్క రాదు. మూఢాచారాలతో కొట్టుమిట్టాడుతూ.. అంధకారంలో ఎదుగుబొదుగులేని జీవితాలు సాగించేవారు.

నేడు విద్యావంతుల అడ్డాగా..

గ్రామానికి చెందిన రూప్లానాయక్ జీవితం గ్రామస్తులను ఆలోచనల్లో పడేసింది. తరాలు మారాయి... ఆలోచన విధానంలో మార్పు వచ్చింది. తాము పడుతున్న కష్టం తమ పిల్లలు పడరాదనే భావన అందరిలోనూ వ్యక్తమైంది. రూప్లానాయక్ తర్వాత ఒక్కొక్కరుగా ఉన్నత చదువులు అభ్యసిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకుంటుండడంతో అందరిలోనూ పట్టుదల పెరిగింది. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు సైతం కసితో ఉన్నత చదువులు అభ్యసించారు. పోటీ పరీక్షల్లో తలపడి తమ సత్తా చాటుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించుకున్నారు. ఈ క్రమంలో గ్రామం మొత్తం విద్యావంతుల ఖిల్లాగా మారింది.

ప్రతి ఇంటిలోనూ ఉద్యోగులే..

ఆర్‌బీవంక తండాలోని ప్రతి ఇంటిలోనూ ఇద్దరు, ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారున్నారు. మున్సిపల్ ఈఈ 1, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్ విభాగంలో ఐదుగురు డీఈలు, 10 మంది డాక్టర్లు, ఐదుగురు ఇంజినీర్లు, ఇద్దరు బ్యాంకు మేనేజర్లు, మరో 20 మందికి పైగా రైల్వేలో, నలుగురు బీఎస్ఎఫ్, 12 మంది పోలీసు శాఖలో, ఎనిమిది మంది ఉపాధ్యాయులుగా, ఆరుగురు సచివాలయ ఉద్యోగులుగా... ఇలా ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలతో పాటు పాటు ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. తండాకు చెందిన రామానాయక్ మున్సిపల్ ఈఈగా ఉద్యోగ విరమణ పొంది ప్రస్తుతం గుంటూరులో స్థిరపడ్డారు. ఆయన ఇద్దరు కుమార్తెలతో పాటు కుమారుడూ ప్రభుత్వ వైద్యులుగా స్థిరపడ్డారు. ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌బీవంక తండా వాసులు.. మారెమ్మ పండుగ వస్తే అంతా ఒక్కటిగా కలుసుకుంటారు. ఆ సమయంలో ఊరంతా ఒక్కటే సందడిగా ఉంటుంది.

అనుకున్నది సాధించా



సేద్యం పనులు చేసుకునేవాడిని. మా బంధువుల పిల్లలంతా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. దీంతో నా బిడ్డలు కూడా వారిలా ఉద్యోగులు కావాలని అనుకున్నా. ఇందు కోసం నాలుగు ఎకరాల పొలాన్ని కూడా అమ్మేసి, పిల్లల చదువులకు ఖర్చు పెట్టాను. ఇప్పుడు నాకున్న నలుగురు బిడ్డలూ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఓ కుమారుడు, కుమార్తె డాక్టర్లుగా, మరొకరు రైల్వే ఇంజినీర్‌గా, ఇంకొకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

– దేన్యానాయక్, ఆర్‌బీవంక తండా

ఉద్యోగుల ఖిల్లా



ఆర్‌బీవంక అంటేనే ఉద్యోగుల ఖిల్లా అని జనం అంటుంటారు. మారెమ్మ పండుగ వస్తే ఎక్కడున్నా.. అందరూ వచ్చి కలుస్తుంటారు. ఒక్కరితో మొదలైన ప్రయత్నం ఎందరో జీవితాలను మార్చేసింది. అందరూ మా ఊరి గురించి గొప్పగా చెబుతుంటే ఎందో ఆనందమేస్తుంది.

– ఆర్.జయరాంనాయక్, గ్రామస్తుడు

పిల్లలందరూ ఉద్యోగులే



నాకున్న నలుగురు పిల్లలూ ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ముగ్గురు కుమారుల్లో ఒకరు సివిల్ కానిస్టేబుల్‌గా, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. కుమార్తె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఈ వయసులో మాకు బిడ్డలు అండగా నిలిచారు.

– కృష్ణానాయక్, ఆర్‌బీవంక తండా

నాన్న రెక్కల కష్టంతోనే



మా ఇంట్లో నాతో పాటు మరో ముగ్గురం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. మా ఈ విజయం వెనుక నాన్న దేన్యానాయక్ రెక్కల కష్టముంది. పేదరికం నుంచి మమ్మల్ని గట్టెక్కించేందుకు నాన్న పడిన కష్టం కంటిముందు ఇప్పటికీ కనిపిస్తోంది. కేవలం చదువులతోనే మా గ్రామ రూపురేఖలు మారాయి.

– డాక్టర్ రమేష్ నాయక్, వైద్యాధికారి, గరుడచేడు

గెలుపే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. శుక్రవారంతో ప్రచారం ముగియనుందని, ఈలోపు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రతి ఓటరునూ చైతన్య పరచాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల బ్యాలెట్‌లో మూడో సంఖ్యలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ బ్యాలెట్‌లో 11వ సంఖ్యలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డికు తొలి ప్రాధాన్యత ఓటు వేసేలా అభ్యర్థించాలన్నారు. ప్రచారంతోనే పని పూర్తికాదని, పోలింగ్ రోజున ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఉషారాణి, వెన్నపూస రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

రాప్తాడురూరల్: ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ సురేష్‌బాబు, పరిశీలకుడు, డీవీఈఓ వెంకటరమణనాయక్ సూచించారు. గురువారం అనంతపురం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులకు (డీఓ) పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ, రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో సీఎస్‌లు, డీఓలు కీలకంగా వ్యవహరించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత కూడా విద్యార్థులందరినీ ఒకేసారి బయటకు పంపకుండా అంచెలుగా పంపాలన్నారు. సమావేశంలో హై పవర్ కమిటీ సభ్యులు ఎస్ఎండీ షఫి, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శంకరయ్య, లక్ష్మీకాంతరెడ్డి, రమణకుమార్, ఎంపీ రంగయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి పాల్గొన్నారు.

హాల్‌టికెట్లపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న ఆర్ఐఓ సురేష్‌బాబు

ఇంటర్ హాల్‌టికెట్ల విషయంపై విద్యార్థులు ఆందోళన పడాల్సిన పనిలేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి సురేష్ బాబు తెలిపారు. రెండుమూడు రోజుల్లో బోర్డు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను ఉంచుతారని వాటిని విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకుంటే చాలునన్నారు. హాల్‌టికెట్లపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం కానీ, సీలు కాని అవసరం లేదని స్పష్టం చేశారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 63,090 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పశ్నపత్రాలను కొత్తూరు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేశామన్నారు. తక్కిన సెట్లు రాగానే స్టోరేజ్ పాయింట్ల (పోలీస్ స్టేషన్)కు తరలిస్తామన్నారు.

గవర్నర్ నజీర్‌తో ఎస్కేయూ వీసీ భేటీ



గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్, వర్సిటీ కులపతి సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ(ఎస్కేయూ) ఉప కులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వీసీ కలసి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. ఎస్కేయూలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

ఉద్యోగాలకు అర్హత సాధించిన జేఎన్‌టీయూ విద్యార్థులు



రెక్టార్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ శశిధర్‌తో ఇండో ఎంఎం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్‌లో తిరుపతిలోని ఇండో ఎంఎం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ మేరకు ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.సుమలత తెలిపారు. మొత్తం 45 మంది మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ కనబరిచిన 21 మందిని ఎంపిక చేసి, టెక్నికల్ రౌండ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. తుది ఫలితాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. అనంతరం జేఎన్‌టీయూ(ఏ) రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌ను కంపెనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆటోడ్రైవర్ బలవన్మరణం


అనంతపురం సిటీ: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... అనంతపురంలోని హెచ్చెల్సీ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గురువారం ఉదయం సమాచారం అందడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సాయంత్రానికి మృతుడిని కక్కలపల్లి కాలనీలోని మండ్ల సుబ్బారెడ్డి నగర్ నివాసి జోగి నీలకంఠేశ్వర (45)గా గుర్తించారు. మృతుని మొదటి భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటికే వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ తర్వాత రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొంత కాలంగా వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న అతను జీవితం విరక్తి పెంచుకుని గురువారం వేకువజామున 1.30 గంటలకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్

గల్లంతైన యువకుడి మృతి

గుంతకల్లు రూరల్: హోలీ సంబరాల్లో పాల్గొన్న అనంతరం స్నేహితులతో కలసి బుధవారం హంద్రీనీవా కాలువలో స్నానానికి వెళ్లిన అసిస్టెంట్ లోకో పైలెట్ అంకిత్ ఖేర్ (28) గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం చీకటి పడేవరకూ పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఉదయాన్ని తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రానికి అంకిత్‌ఖేర్ మృతదేహాన్ని జి.కొట్టాల సమీపంలో గుర్తించి వెలికి తీశారు.

వైభవంగా నారసింహుడి బ్రహ్మోత్సవాలు

- సూర్య, చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై నారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదవ రోజైన గురువారం ఖాద్రీశుడు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానని చాటి చెబుతూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలను అధిష్ఠించి దర్శనమిచ్చారు. సూర్య మండల మధ్యస్థుడైన మహా విష్ణువుకు నారాయణుడని పేరు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను మహావిష్ణువు రెండు కళ్లుగా కలిగివుండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానేనని చాటిచెబుతూ తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా అంబే శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

నేడు మోహినీ ఉత్సవం..

ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. పాలకడలిని మదించి అందులో ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడతారు. ఆ అమృతాన్ని పంచడానికి మహావిష్ణువు మోహినీ అవతారమెత్తారు. దేవతలకు అమృతాన్ని పంచిపెట్టి అసురులను మభ్యపెట్టేందుకు శ్రీవారు ఈ అవతారాన్ని ధరిస్తారని భక్తుల నమ్మకం.

'సూపర్'లో అరుదైన శస్త్ర చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు (చిత్రంలో) చిన్నారి కుటుంబసభ్యులు



చిన్నారి బిందు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. నాలుగు నెలల చిన్నారి మెదడులోని క్యాన్సర్ గడ్డను తొలగించి ప్రాణం పోశారు. ఇప్పటి వరకూ మెట్రో నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే అందుతున్న ఈ అరుదైన శస్త్రచికిత్సను జిల్లా కేంద్రానికి చేరువ చేశారు. వివరాలను గురువారం సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత వైద్యులు వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని న్యూ కాలనీకి చెందిన నవీన్‌కుమార్, వనజ దంపతులకు నాలుగు నెలల వయసున్న కుమార్తె బిందు ఉంది. గత నెల తీవ్రమైన జ్వరంతో చిన్నారి బాధపడుతుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో హుటాహుటిన అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు వెంటనే సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు రెఫర్ చేశారు. పలు వైద్య పరీక్షల అనంతరం చిన్నారి మెదడులో క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు న్యూరో సర్జన్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు గుర్తించారు. శస్త్రచికిత్స చేస్తే చిన్నారి ప్రాణాలు దక్కుతాయని తల్లిదండ్రులకు తెలిపి, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. గత నెల 25న చిన్నారికి శస్త్రచికిత్స చేశారు.

15 రోజుల పాటు ప్రత్యేక నిఘా..

శస్త్ర చికిత్స అనంతరం చిన్నారి కోలుకునేందుకు అవసరమైన చర్యలను వైద్య నిపుణులు తీసుకున్నారు. 15 రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీడియాట్రీషన్ నేతృత్వంలో చికిత్సలు అందజేశారు. అనంతరం చిన్నారి క్రమంగా కోలుకుంటూ వచ్చింది. ఈ శస్త్రచికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తారు. ఇంతటి ఖరీదైన శస్త్రచికిత్సను రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు ఉచితంగా చేశారు.

ఇంకో చిన్నారికీ ప్రాణదానం..

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పామిడి మండలం పొగరూరు గ్రామానికి చెందిన చిన్నారి రాజేష్‌కు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తల్లిదండ్రులు సరైన చికిత్సను అందించలేకపోయారు. ఈ క్రమంలో మెదడులో చీము గడ్డ కట్టింది. దీంతో ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో తల్లిదండ్రులు చేర్పించారు. ప్రత్యేక చికిత్సల ద్వారా చిన్నారి మెదడులోని చీము గడ్డను వైద్యులు తొలగించారు. ప్రస్తుతం ఆ చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు. ఇదే తరహా వైద్యాన్ని గుంతకల్లుకు చెందిన యువకుడు మస్తాన్ వలి(బయోమా ట్యూమర్)కి సైతం వైద్యులు అందజేశారు. విలేకరుల సమావేశంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, న్యూరో సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కర్, డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు, డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ యదుభూషణ్‌రెడ్డి, టెక్నీషియన్లు వన్నూర్‌వలి, పవన్‌కుమార్, అశోక్, కిరణ్మయి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన మలోబిలేశుడి ఉత్సవాలు



మలోబిలేశు మూలవిరాట్‌కు మంగళహారతి ఇస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలోబిలలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి అభిషేకాలు, మహా మంగళహారతి అందించారు. అనంతరం స్వామి మూలవిరాట్‌కు చక్రస్నానం, మహా పూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, ధ్వజావరోహణ పూజలు చేశారు.

ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలి

ఆత్మకూరు: ప్రతివిద్యార్థీ ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ నరసింహారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు తెలిపారు. పరీక్షలు ముగిసేవరకు టీవీలు , సెల్‌ఫోన్లు చూడరాదన్నారు.

మహిళలకు పరుగు పందేలు



పతకాలు సాధించిన క్రీడాకారిణులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు గురువారం ప్రత్యేక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి 100, 200, 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరిగాయి. విజేతలకు అదనపు ఎస్పీ హనుమంతు, డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యంతో ఆరోగ్యం



నృత్యశిక్షణాలయాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ నృత్యంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక మూడోరోడ్డులో నృత్య కళానిలయం శాఖను ప్రారంభించారు. ముఖ్యఅతిథులు డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి లక్ష్మి, బుల్లితెర నటులు శ్రీనిధి రఘు, రమేష్ నీల్ మాట్లాడారు. కళలు చదువుతోపాటు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా శాఖా నృత్య పాఠశాలను నిర్వహించే కళాకారిణి హిమజ నేతృత్వంలో నృత్యకళానిలయం విద్యార్థులు శాస్త్రీయ నాట్య ప్రదర్శనతో మెప్పించారు. అనంతరం నాట్య గురువు సంధ్యామూర్తిని నిర్వాహకులు హిమజ తదితరులు గురుపూజ చేశారు.

వ్యవసాయ పనిముట్లు వినియోగించుకోండి

శింగనమల: వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా అందించిన పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుత్తి ఏడీఏ నారాయణ నాయక్ సూచించారు. గురువారం నిదనవాడ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయానికి వ్యవసాయ పనిముట్లు అందించామన్నారు. వాటిని రైతులు అద్దెకు తీసుకొని వినియోగించుకోవాలన్నారు. ఏడీసీసీ బ్యాంక్ అధికారి సునీత, బ్యాంక్ లావాదేవీలపై వివరించారు. ఏఓ చిన్నమ్మ, ఎరువుల హబ్ ఏఈఓ కృష్ణ భగవాన్, వైఎస్సార్ సీపీ నేత నారాయణరెడ్డి,, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతూరులో సచివాలయ సిబ్బందికి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఓటును అభ్యర్థిస్తున్న ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం



4వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

ప్రజాప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం అరవిందనగర్, కృపానందనగర్, జీసస్‌నగర్, పాతూరు తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి, మూడున్నరేళ్ల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం కోవిడ్ కారణంగా రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, ఇలాంటి తరుణంలో జీతాల జాప్యం జరిగిందని, ఇదే పరిస్థితి తెలంగాణ, కేరళ, గుజరాత్, తదితర ప్రాంతాల్లో ఎదురైందన్నారు. గత ప్రభుత్వాలకంటే భిన్నంగా అవినీతి లేని పారదర్శక పాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా అందించిన విషయాన్ని ఓటర్లకు గుర్తు చేశారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థులకే వేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు బాలాంజనేయులు, గూడూరు మల్లికార్జున, అబూసలేహ, బాబాఫక్రుద్దీన్, అనిల్‌కుమార్ రెడ్డి, ఇస్సాక్, సుమతి, లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర ప్రచారం..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార గడువు శుక్రవారంతో ముగియనుండడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గురువారం నగరంలోని అర్బన్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగించారు. ఉర్దూ అకాడమి రాష్ట్ర చైర్మన్ నదీమ్‌అహ్మద్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, నూర్ బాషా సంఘం అధ్యక్షుడు నబీరసూల్, నాయకులు పాన్ సాదిక్, ముస్తఫా, జక్రియా, మూహిబ్, కేశవ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని ఉమానగర్‌లో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఎన్నికల ప్రచారం చేశారు. 3వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి ప్రచారం చేశారు. సురేష్‌రెడ్డి, బాబాఫక్రుద్దీన్, దస్తగిరి, ఉప్పలప్ప, శీనా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

రాప్తాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రా రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం గాండ్లపర్తి, పాలచెర్ల, భోగినేపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

ఆత్మకూరు: మొదటి ప్రాధాన్యత ఓటు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పట్టభద్రులను కోరారు. గురువారం వేపచెర్ల, వేపచెర్ల ఎగువ తండా, వేపచెర్ల దిగువ తండా , తోపుదుర్తి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, నాయకులు బాలపోతన్న, వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, అతికిరెడ్డి, కృష్ణానాయక్, గోపాల్‌రెడ్డి, రవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామానా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని ఆపార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, పార్టీ మండల నాయకులు కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు మద్దెలచెరువు, వేపకుంట, భానుకోట, నరసంపల్లి, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్‌రెడ్డి, ప్రభాకర్, పాపన్న, పెద్దిరెడ్డి, రవి, అశోక్, నవీన్, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీందారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మేడాపురం, పెద్ద మొగలాయిపల్లి, చిన్న మొగలాయిపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ గడప గడప కార్యక్రమ ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహా రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పాలచెర్లలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు



వేపచెర్లలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి



మేడాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

శిక్షణలో బిజీబిజీ



పోలింగ్ విధానంపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ఈనెల 13న జరగనుంది. ఈ క్రమంలో పోలింగ్ విధానంపై ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులకు ప్రయోగాత్మక శిక్షణ గురువారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించారు. ఇందు కోసం మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. శిక్షణ నోడల్ అధికారి డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి నేతృత్వంలో ఆ శాఖ పీఎం, ఏపీఎంలు రాధారాణి, రవీంద్రబాబు, సుభద్రమ్మ, శ్రీనివాసులు, సత్యనారాయణ, రామిరెడ్డి, వలి, తదితరులు శిక్షణ ఇచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి 49 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో బ్యాలెట్ పేపర్ పెద్దగా ఉంది. ఈ నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ నెంబర్, ప్రిసైడింగ్ అధికారి సంతకం కనిపించేలా బ్యాలెట్ పేపర్‌ను ఏ విధంగా మడత పెట్టాలి అనేది దానిపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పోలింగ్ స్టేషన్‌లో ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులను ప్రయోగాత్మకంగా చూపించారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

గార్లదిన్నె: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని డీఈఓ సాయిరాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా రాత్రి 9 గంటల సమయంలో పదోతరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి చదువుపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులు సబ్జెక్టు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా? ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతున్నారా? వంటి విషయాలు పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో చదవి ఉత్తీర్ణత పొందాలన్నారు. టీవీలు చూడడం, సెల్‌ఫోన్ వాడటం చేయరాదన్నారు. ఏఎంఓ హరికృష్ణ, ఏపీఓ నారాయణ స్వామి, ఎంఈఓ చంద్రానాయక్ ,మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పీడీ దుర్మరణం

- రాత్రి 11 గంటల సమయంలో కురుగుంట సమీపంలో ఘటన
- ఆగివున్న లారీకి వెనుకవైపు నుంచి ఢీకొట్టిన బైకు



శైలజ మృతదేహం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తున్న మహిళ దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు...కురుగుంటలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో శైలజ (50) పీడీగా పని చేస్తున్నారు. ఈమె కుటుంబం కళాశాల ఆవరణలోనే క్వాటర్స్‌లో నివాసం ఉంటు న్నారు. పని నిమిత్తం గురువారం సాయంత్రం నగరంలోకి వెళ్లిన శైలజ రాత్రి 11 గంటల సమయంలో తన బంధువు కుళ్లాయిస్వామితో కలిసి బైకులో కురుగుంటకు బయల్దేరారు. మార్గంమధ్యలో ఇంటెల్ కళాశాల సమీపంలో లారీ (టెన్‌వీలర్)రోడ్డుపక్కన నిలబడింది. ఈ వాహనాన్ని గమనించని కుళ్లాయిస్వామి బైక్‌తో వెనుకవైపు నుంచి బలంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో శైలజ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కుళ్లాయిస్వామిని 108 వాహనంలో సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. లారీ పూర్తి స్థాయిలో పక్కన పెట్టకపోవడం కూడా ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. కాగా మృతురాలు శైలజ వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం



రైతులకు కోళ్లను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి పేర్కొన్నారు. గురువారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ మార్కెట్‌లో చికెన్, కోడిగుడ్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. కోళ్ల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. రైతులు ఇంటి పరసరాల ప్రాంతాలలోనే పెరటి కోళ్ల పెంచుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు కడక్‌నాథ్ కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి డాక్టర్ శశికళ, నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇస్తెమాపై సమావేశం



మత పెద్దలతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగర శివారులోని ఆటోనగర్ సమీపంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న దీనీ ఇస్తెమా (జిల్లా స్థాయి) ఏర్పాట్లను నగర మేయర్ వసీం , జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో పెద్ద ఎత్తున ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. కార్యక్రమాన్ని ముస్లింలు అత్యంత పవిత్రంగా భావిస్తారని, 4 లక్షల మంది హాజరవుతారని అంచనా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, బాబాఫక్రుద్దీన్, అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మధు, మెహరాజ్, మత పెద్దలు అమీర్‌బాషా, రఫీ, నూరుబాషా, మత పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఓబుళంపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కనగానపల్లి: మండలంలో ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్ట్యా ధర్మవరంలోని ఏపీడీ క్లస్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ నివేదికను చదివి వినిపిస్తారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాడిపత్రి టౌన్ : విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో ఈనెల 11,12 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో సబ్ జూనియర్, కాడెట్ పోటీలకు తాడిపత్రి క్రీడాకారులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో నియాజ్, హుస్సేన్, లోకేష్ గౌడ్, విష్ణు, నవదీప్, సబ్ జూనియర్ బాలిక విభాగంలో సుభిక్షిత, మహతి, అక్షయ, కేడెట్ బాలుర విభాగంలో షెక్షావలి, రంగ, దీరజ్, హర్షవర్ధన్‌రెడ్డి, కేడెట్ బాలిక విభాగంలో సాయి దీప్తి, అనిత, శ్రీవిద్య ఎంపికయ్యారు.

సరస్వతీ నమస్తుభ్యం





కేఎస్ఆర్‌లో సరస్వతిపూజ, విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమం

నగరంలోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు గురువారం సరస్వతీ పూజ నిర్వహించారు. 'సరస్వతీమాత..నమస్తుభ్యం' అంటూ చదువుల తల్లికి నమస్కరించుకున్నారు. ఏడాదిపాటు విద్యార్థినులు ఆటపాటలకు దూరంగా ఉన్నారు. ఉత్తీర్ణతే లక్ష్యంగా నిరంతరం పుస్తకాలతో కుస్తీపడ్డారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఓ వైపు ఫలితాలపై బెంగ.. మరోవైపు కళాశాల ముగుస్తోంది. ఇప్పటి వరకు తోటిమిత్రులతో సరదాగా గడిపిన క్షణాలను గుర్తుకు చేసుకుని విద్యార్థినులు ఉద్వేగానికి గురయ్యారు. కళాశాలలోని జ్ఞాపకాలతో సెల్ఫీలు తీసుకున్నారు. అధ్యాపకులను ఆప్యాయంగా పలకరించి, ఒకరినొకరు ఆల్ ద బెస్ట్ చెప్పుకుంటూ ఆనంద భాష్పాలతో వీడ్కోలు పలికారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కార్గోలో వస్తువులకు వేలం

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ అనంతపురం కార్గో సర్వీసులో వినియోగదారులు తీసుకెళ్లని వస్తువులను గురువారం వేలం వేశారు. మొత్తం 50 రకాల వస్తువులకు రూ.68,600 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఏటీఎం కమర్షియల్ అమర్‌నాథ్, డీఎంఈ కొండయ్య, అకౌంట్ ఆఫీసర్ లక్ష్మీదేవి, సెక్యూరిటీ ఏఎస్‌ఐ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి



సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ఎస్కేయూలో పాలిమర్ సైన్స్ విభాగంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. ఉన్నత స్థానాలు అధిరోహించిన మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ న్యాయవాది జి. పద్మజ హాజరై ప్రసంగించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళాహక్కులు, చట్టాలపై ఆమె వివరించారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ ఆర్.జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం.. మహిళా దినోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక రాజురోడ్డులోని ఆవోపా కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిపారు. గురువారం ఆవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగ్ వారు ఆనందోత్సాహాల నడుమ వేడుకలు నిర్వహించారు. ప్రోగ్రాం కన్వీనర్ కాకుమాని చంద్రకళ, ఆవోపా అధ్యక్షురాలు గూడూరు అనురాధ నేతృత్వంలో జరిగిన వేడుకలకు సీడబ్ల్యూసీ చైర్మన్ మేడా రామలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల గొప్పతనాన్ని గుర్తించే ప్రభుత్వం వారికి కీలక పదువులు ఇచ్చి ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. వృద్ధులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవోపా సెక్రటరీ కాసంశెట్టి ఇందిర, కోశాధికారి భువన పాల్గొన్నారు.

మాతృత్వం దేవుడిచ్చిన వరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: మాతృత్వం దేవుడిచ్చిన వరమని ఉమెన్ ఎంపవర్‌మెంట్ అధికారిణి శ్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సామూహిక సీమంతం నిర్వహించారు. ఆస్పత్రి అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సునీత హాజరయ్యారు. మొత్తం 40 మందికి సీమంతాలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీమంతం కార్యక్రమానికి గొంది పవన్‌కుమార్, గొంది నందిని ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ విజయసాయికుమార్, పద్మలత, గొంది నగేష్, సంధ్య, సాయి ట్రస్ట్ సభ్యులు నారాయణ, రాజు పాల్గొన్నారు.



ఆవోపా కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు